క్లుప్తంగా

పెరిగిన ఉపాధి కూలీల హాజరు



శిరివెళ్లలో పంట కాల్వలలో పూడిక తీస్తున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోజు రోజుకు కూలీల హాజరు పెరుగుతోంది. గత నెల 26న మండలంలో పంట కాల్వల పనులు ప్రారంభమయ్యాయి. అప్పుడు రోజుకు 1,587 మంది పనులకు వచ్చేవారు. ప్రస్తుతం 3,027 మంది పనులకు హాజరవుతున్నారు. వేసవి దృష్ట్యా ఉదయం 6 గంటలకే పపనులకు వెళ్తున్నారు. 10 గంటల కల్లా ఇళ్లకు వస్తున్నారు. కామినేని పల్లెలో 500, గోవిందపల్లెలో 420, చెన్నూరులో 462, బోయలకుంట్ల 256, గంగవరం 130, గుంప్రమాన్‌దిన్నె 59, గుండంపాడు 15, జీనేపల్లె 14, కోటపాడు 120, మహాదేవపురంలో 205, వనికినిదిన్నె 207, వెంకటాపురం 9, యర్రగుంట్ల 80 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

నక్కి రామన్నకు నివాళి



నక్కిరామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నక్కి రామన్న 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పేదలకు భూములు పంపిణీ చేసేందుకు పోరాటం చేసిన వ్యక్తి రామన్న అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, రాముడు, ప్రభాకర్, శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మందుల విరాళం

నంద్యాల టౌన్: పట్టణంలోని గిరినాథ్ సెంటర్ ప్రాంతంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న చాకలి లక్ష్మీనారాయణకు రెండు వేల రూపాయలు విలువైన మందులు సెవెన్‌హిల్స్ మల్టీస్పెషాలిటీ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బోరెడ్డి శ్రీకాంత్ రెడ్డి విరాళంగా అందజేసినట్లు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మారుతి తెలిపారు. చికిత్సకు తగిన నగదు లేక ఇబ్బంది పడుతున్న లక్ష్మీనారాయణ పరిస్థితి గురించి రెడ్ క్రాస్ సిబ్బంది వివరించగా వైద్యుడు అతనికి మందులు ఉచితంగా అందజేశారన్నారు.

9 మందిపై కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తులలో బుధవారం హరి అనే వ్యక్తిపై దాడి చేసినందుకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున ఎల్లావత్తుల గ్రామానికి చెందిన తుమ్మల కిట్టు అనే వ్యక్తిని ఓటు వేసేందుకు క్యూ లైన్లో వెళ్లాలని హరి చెప్పాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే అక్కడున్నవారు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బుధవారం వారిద్దరి మధ్య మళ్లీ మాటామాట పెరిగి కిట్టుతో పాటు మరో 8 మంది కలిసి హరిపై దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ఆలయంలో ఏపీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి నంద్యాల జిల్లా అగ్నిమాపకాధికారి యోగేశ్వర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలంకార మండపంలో వారికి స్వామి ,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

అనాథ వృద్ధుడు మృతి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం సర్కిల్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు స్టాప్ వద్ద గుర్తు తెలియని అనాథ వృద్ధుడు మంగళవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు ఆ వృద్ధుడి వయసు దాదాపు 70 ఏళ్ల ఉంటాయి. కొద్దిరోజుల నుంచి ఈ ప్రాంతంలో భిక్షాటనచేస్తూ రాత్రి బస్సు స్టాప్‌లో ఉండేవాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి వివరాలు లేకపోవడంతో గుర్తు తెలియని వృద్ధుడి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

వెల్లివిరిసిన చైతన్యం

- తెల్లవారు జాము నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరిన ఓటర్లు
- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న యువత, మహిళలు, వృద్ధులు
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 84.06 శాతం పోలింగ్ నమోదు
- ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక శాతం పోలింగ్
- స్ట్రాంగ్ రూంలలో అభ్యర్థుల భవితవ్యం



ఓటు వేసేందుకు క్యూలైన్లో నిలుచున్న మహిళలు (ఫైల్)

ఆళ్లగడ్డ : ఇంటింటా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఐదేళ్లకోసారి వచ్చే ఓటు వేసే అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో రెక్కలు కట్టుకుని మరీ సొంతూర్లలో వాలారు. ఎండను లెక్కజేయకుండా యువత, మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. తమ భవితను నిర్ణయించే నేతకు ఓటేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవుతుందని తెలిసినప్పటికి అనేక మంది తెల్లవారు జామునుంచే తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి క్యూలైన్లలో నిల్చున్నారు. చాలా చోట్ల పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటలకు ముగిసినప్పటికీ క్యూలో నిల్చున్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. ఓటర్లు గంటల తరబడి ఓపికగా వేచి చూసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

84.06 శాతం పోలింగ్ నమోదు

నియోజకవర్గంలో 2,32,676 మంది ఓటర్లు ఉండగా ఇందులో సోమవారం 1,95,582 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 98,082 మంది మహిళలు కాగా పురుషులు 97,494 మంది ఉన్నారు. నియోజవర్గంలో 84.06 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఇందులో అత్యధికంగా రుద్రవరం మండలంలో 86.85 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా శిరివెళ్ల మండలంలో 82.85 శాతం నమోదైంది.

వైఎస్సార్‌సీపీలో జోష్

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తడంపై వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సుపరిపాలన నచ్చి, సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు అధిక సంఖ్యలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారని లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

జూన్ 4న కౌంటింగ్

పోలింగ్ పూర్తి కావడంతో అభ్యర్థులు క్షేత్ర స్థాయిలో పరిస్థితిపై దృష్టి పెట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో జూన్ 4న ఓట్లు లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

పకడ్బందీగా ఈవీఎంల భద్రత

నియోజవర్గంలోని 292 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూంకు తరలించడం జరిగింది. అభ్యర్థులు, అధికారుల సమక్షంలో వాటిని రూంలకు తరలించి సీల్ కూడా వేశాం. కట్టుదిట్టంగా మూడంచల భద్రత ఏర్పాటు చేసి భద్రపరిచాం.

– మల్లికార్జునరెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్ శాతం ఇలా..

		మొత్తం ఓట్లు				పోలైన ఓట్లు				
మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓట్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	నమోదైన పోలింగ్ శాతం
దొర్నిపాడు	26	10,084	10,202	1	20,287	8,751	8667	0	17,481	85.86
ఉయ్యాలవాడ	30	11,284	11,572	2	22,858	9,547	9,650	0	19,197	83.98
శిరివెళ్ల	62	23,567	23,843	2	47,412	19,599	19,683	1	39,283	82.85
ఆళ్లగడ్డ	74	31,085	32,609	4	63,698	26,156	26,949	2	53,107	83.37
రుద్రవరం	51	18,755	18,899	2	37,656	16,598	16,104	2	32,704	86.85
చాగలమర్రి	52	20,180	20,584	1	40,765	16,843	17,029	1	33,873	83.09
మొత్తం	295	11,4955	11,7709	12	23,2676	97,494	98,082	6	19,8852	84.06

ఎన్నికల నిర్వహణలో మార్పులు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల నిర్వహణలో మార్పులు అవసరమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఇచ్చే భత్యంలో తేడాలు ఎందుకు ఉన్నాయో అర్థం కావడం లేదని, తెలంగాణలో ఒక విధంగా, ఇక్కడ మరో విధంగా ఇస్తున్నారన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బనగానపల్లె, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పీఓ, ఏపీఓలకు వివిధ రకాలుగా ఎన్నికల భత్యం చెల్లించారన్నారు. ఆడిట్ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. రాష్ట్రమంతా ఒకే విధమైన పాలసీ తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రామ్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, మధు సూధన్, సోమయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేలమఠంలో ఆరాధనోత్సవాలు

బనగానపల్లె : బనగానపల్లె సమీపంలోని వీరప్పయ్య స్వామి నేలమఠంలో ఈ నెల 17 నుంచి 19వరకు 331వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 17న ఉదయం 5 గంటలకు నాగస్వరం, సుప్రభాతం, పంచామృతాభిషేక అష్టోత్తర శతనామ పూజలు, మాత వీరకాళికాంబదేవికి కుంకుమార్చన, 10 గంటలకు గరిమిరెడ్డి అచ్చమాంబ ఇంటి నుంచి స్వామివారి జీవసమాధి జ్ఞాపిక పతాకం తీసుకొస్తారు. సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవా నిర్వహిస్తారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 9,800 మంది కూలీలు వుండగా ప్రస్తుతం రోజు 3,120 మంది పనుల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ రోజుకు 5,000 మందికి పనులు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం పెంచిన రోజువారీ వేతనం రూ. 300పై క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గాయని కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

వంద ఎకరాల్లో పండ్ల తోటలు

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం వంద ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీ అందిస్తోందని ఏపీఓ తెలిపారు. ఇప్పటి వరకు పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, తుడుమలదిన్నె, సుద్దమల్ల, రూపనగుడి, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో 69 ఎకరాలు గుర్తించినట్లు వెల్లడించారు. కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు చేసుకునేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని స్పష్టం చేశారు.

సాక్షిగణపతికి విశేష పూజలు



శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న సాక్షి గణపతికి బుధవారం సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలతో అభిషేకించి ఉండ్రాళ్లను, రవ్వ లడ్లను నైవేద్యంగా సమర్పించారు.

‘ప్రతిభ’కు ప్రభుత్వ ప్రోత్సాహం

- పది, ఇంటర్ టాపర్లకు ప్రభుత్వం నజరానా
- పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మానం
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖాధికారులు



స్టడీ అవర్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

నంద్యాల (న్యూటౌన్): ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతి పరీక్షల్లోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట సన్మానాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు రెండో ఏడాది కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అధికారులు విద్యార్థుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. పాఠశాల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఇలా నాలుగు స్థాయిలుగా జగనన్న ఆణిముత్యాల సన్మానాలతో పాటు నగదు పారితోషికం అందజేయనున్నారు .

మొదటి మూడు స్థానాలకు..

జిల్లా విద్యాశాల అధికారులు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి గతేడాదే శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు.. విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని తీసుకొస్తాయనేది ప్రభుత్వ ఉద్దేశం. సీఎం నిర్ణయంపై అ ఉపాధ్యాయ వర్గాలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజయం వైఎస్సార్‌సీపీదే



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

- ఆళ్లగడ్డ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 84.06 శాతం పోలింగ్ నమోదు కావడం శుభపరిణామం
- మంగళవారం జరిగిన ఘటనను ఖండిస్తున్నాం
- అఖిలప్రియ ఇంటి వద్ద బెంగళూరు బౌన్సర్లు ఎందుకున్నారో?
- రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ : ఎన్నికల్లో విజయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అని రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా 1,95,582 మంది ఓటర్ల తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 84.06 శాతం పోలింగ్ నమోదు కావడం శుభపరిణామమన్నారు. ఇంత పెద్ద ఎత్తున పోలింగ్ జరిగినా ఎక్కడా ఏ చిన్న ఘటన కూడా చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవడం, ప్రజలు సంయమనం పాటించడం సంతోషకరమన్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఘటను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులు ఎవరు చేసుకున్నా తప్పేనన్నారు. కొత్తవారు, నియోజకవర్గంలో ఓటు హక్కులేని వారు ఎవరూ ఉండకూడదని ఎన్నికల కమిషన్ సూచించినప్పటికీ బెంగళూరు నుంచి వచ్చిన బౌన్సర్లు అఖిలప్రియ ఇంటి దగ్గర ఎందుకు ఉన్నారో చెప్పాలన్నారు. ఈ విషయం ఫొటోలతో సహా ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగిందని, విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఓటింగ్‌లో పాల్గొన్న ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఓటర్లు మరింత చైతన్య వంతులై 100 శాతం పోలింగ్ నమోదు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు

మహానందిలో భక్తుల సందడి



రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమితానందం పొందుతూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగగా రాత్రి ఏకాంతసేవ పూజల వరకు భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు.

చురుగ్గా చందలూరు చెరువు పనులు

- చెరువు మట్టితో కట్ట బలోపేతం
- నీరు సులువుగా పారేందుకు నూతన తూము నిర్మాణం
- వర్షాలు రాకముందే పూర్తి చేసేందుకు అధికారుల చర్యలు



చందలూరు చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

రుద్రవరం: మండలంలోని చందలూరు గ్రామ సమీపంలోని చెరువు వద్ద అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వర్షాలు రాక ముందే పనులన్నీ పూర్తి చేయించాలని చిన్నతరహా నీటి పారుదల శాఖ అధికారులు పనులను త్వరిత గతిన చేయిస్తున్నారు. గతేడాది చెరువుల అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కింద మండలంలోని ఐదు చెరువులను ఎంపిక చేసి దాదాపు రూ.1.85 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో అధికారులు అప్పట్లోనే పనులను ప్రారంభించారు. ఒక్కో చెరువు పనులను పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగానే చందలూరు చెరువు పనులు చేపట్టారు.

గతంలో అధ్వానం..

గతంలో చందలూరు చెరువు పరిస్థితి అధ్వానంగా ఉండేది. చెరువు కట్ట దెబ్బతిని ఎక్కడ బడితే అక్కడ గండ్లు పడేలా ప్రమాదకరంగా ఉండేది. అలాగే చెరువు తూము సక్రమంగా లేక చెరువుకు వచ్చే నీరంతా నిల్వ ఉండగా వృథాగా దిగువకు పారేది. దీంతో రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారు. అలాంటి చెరువుకు ప్రభుత్వం దాదాపు రూ.45 లక్షల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు పనులు చేపట్టారు. చెరువు అంతర్భాగంలో నుంచే మట్టిని టిప్పర్ల ద్వారా కట్టపైకి తరలించారు. ఎక్స్‌వేటర్‌తో చదును చేసి రోలర్‌తో తొక్కించి బలోపేతం చేశారు. అలాగే దిగువన ఉన్న ఆయకట్టు పొలాలకు సాగునీరు సులువుగా పారేందుకు నూతనంగా తూము నిర్మించారు. తూముకు షెట్టర్ అమర్చడంతో పాటు అక్కడక్కడ చిన్న పనులు ఉన్నాయని త్వరగా ఆ పనులు పూర్తి చేయిస్తామని ప్యాకేజీ ఎంఐ ఏఈ రఘురాం తెలిపారు. చెరువు ఇంత పటిష్ట వంతంగా చేయించడంతో చందలూరు గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చెరువు సమస్యలపై ఇంత చొరవ చూపలేదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే అభివృద్ధి పనులు చేసి అండగా నిలిచిందని రైతు కృతజ్ఞతలు తెలిపారు.



చెరువు కట్టపై మట్టిని చదును చేస్తున్న జేసీబీ



నూతనంగా నిర్మించిన తూము



చెరువు కట్టను బలోపేతం చేసిన దృశ్యం

అశ్రునివాళి
Asleep in the arms of JESUS

"Whether we live or die, we are the Lord's"
Romans 14:8
Deeply mourned by
Address:26/318-B, Near LIC Office, Nandyal - 518502.
Cell: 99896 71936

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్లగడ్డ
99122 20581 (నంద్యాల)
70750 09103 (ఆళ్లగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com